

# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 239 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 23 సెప్టెంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## వందే మాతరం పాడకుంటే జైలు శిక్ష కరెక్ట్ కాదు: సుప్రీంకోర్టు



**హైదరాబాద్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:** జాతీయ గీతం 'వందేమాతరం'ను పూర్తిగా పాడేందుకు అభ్యంతరం వ్యక్తం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం సరికాదని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వానికి జాతీయ గీతం నిడివి, పరిధిని పెంచేందుకు అధికారం ఉందని, ఇది వ్యక్తిగత, సామూహిక మతస్వేచ్ఛను

మిగతా2లో...

## ఒప్పందాన్ని తిరస్కరిస్తే .. ఇరాన్‌ను నాశనం చేస్తాం

**- ఐరాస జనరల్ అసెంబ్లీలో ట్రంప్ బెదిరింపు**



**న్యూయార్క్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:** పశ్చిమాసియాలో యుద్ధం ముగింపుపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడులను పునఃప్రారంభించాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. నవంబర్ 3న జరిగే మధ్యంతర ఎన్నికల

మిగతా2లో...

## గురువుల జోలికొస్తే సహించేది లేదు

**అండమాన్‌లో ఉన్నా.. ఆస్ట్రేలియాలో ఉన్నా వదలం**

**తనపై కోపం ఉంటే నాతో తేల్చుకోండి.. టీచర్లపై దాడులు చేస్తే ఊరుకునేది లేదు: మంత్రి లోకేశ్**



**అనంతపురం,మన జనప్రగతి సెప్టెంబర్ 22:** గురువులపై దాడులకు పాల్పడిన వారిని ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హెచ్చరించారు. వారు అండమాన్‌లో ఉన్నా, ఆస్ట్రేలియాలో ఉన్నా చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.మంగళవారం రాప్తాడు నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. విజయవాడలోని శాప్

మిగతా2లో...

## 'స్థానికం' వందశాతం గెలిచి తీరాల్సిందే..

**● ఓడితే పక్కన పెట్టడం ఖాయం ● టీడీపీ శ్రేణులకు స్పష్టం చేసిన చంద్రబాబు**



**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 22:** 'స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజీపడే ప్రశ్నే లేదు. వందకి వంద శాతం గెలిచి తీరాల్సిందే. ఏ పంచాయతీ లేదా వార్డు ఓడిపోతారో అక్కడి నాయకులను కచ్చితంగా పక్కన పెట్టేస్తాను' అని ఖరాఖండీగా చంద్రబాబు చెప్పారు. శాంతిపురం మండలం కడపల్లెలోని తన స్వగృహం సమీపంలో మంగళవారం సాయంత్రం ఆయన తెలుగుదేశం పార్టీ అ?ధినేత హోదాలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. పార్టీ వర్గాల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పంచాయతీల వారీగా పార్టీ బాధ్యుల పనితీరును చంద్రబాబు సమీక్షించారు. పెర్ఫార్మెన్స్ తక్కువ ఉన్నవారిని సంజాయిషీ కోరారు. కార్యకర్తల ఆర్థిక బాధ్యతలు తాను చూసుకుంటానని చంద్రబాబు చెప్పారు. ఇంటికొకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నది తన లక్ష్యమన్నారు. అందుకు అన్నివిధాలా చేయూతనిస్తానన్నారు. దీనిని

మిగతా2లో...



## స్థానిక ఎన్నికలకు జనసేన సన్నద్ధం కావాలి

**- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలి: పవన్ కళ్యాణ్**

**కాకినాడ:మన జనప్రగతి సెప్టెంబర్ 22:** స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సన్నద్ధం కావాలని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. ఎన్నికలను ప్రణాళికాబద్ధంగా ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందించుకోవాలని స్పష్టం చేశారు.మంగళవారం మధ్యాహ్నం కాకినాడలో జనసేన నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ మంత్రులు, ఎంపీలు,

మిగతా2లో...

## అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్



**హైదరాబాద్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ ఎన్. లక్ష్మీభాస్కర్‌ను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. కాసేపట్లో ఆయనను కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ రోజు ఉదయం నుంచి హైదరాబాద్ ఎర్రగడ్డలోని లక్ష్మీభాస్కర్ నివాసంతో పాటు మరో 7 ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి, మణికొండ,

మిగతా2లో...

## అంగరంగ వైభవంగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

**● దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న అనంత్ నాగ్ ● ఉత్తమ నటుడి అవార్డును అందుకున్న మమ్ముట్టి, కార్తిక్ ఆర్యన్ ● 'కల్కి 2898 ఏడీ'కి రెండు జాతీయ అవార్డులు ● తెలుగు సినిమాలు 'పుష్ప 2', 'కమిటీ కుర్రోళ్లు', '35.. చిన్న కథ కాదు', 'లక్కీ భాస్కర్'కు అవార్డులు**



**న్యూఢిల్లీ,మన జనప్రగతి సెప్టెంబర్ 22:** ప్రతిష్ఠాత్మకమైన 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో తారల తళుకుబెళుకుల మధ్య అంగ రంగ వైభవంగా జరిగింది. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వేదికగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ చేతుల మీదుగా పలువురు ప్రముఖ సినీ నటులు, సాంకేతిక నిపుణులు పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు. మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, బాలీవుడు నటుడు కార్తిక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. భ్రమయుగం చిత్రానికి మమ్ముట్టిని, చందూ ఛాపియన్ చిత్రానికి కార్తిక్ ఆర్యన్‌ను ఈ అవార్డు వరించింది. ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370 నిలిచింది. ఈ చిత్రంలో నటించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. అమరన్ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి అవార్డును అందుకున్నారు.**సత్తా చాటిన తెలుగు సినిమాలు...** జాతీయ అవార్డుల్లో

మిగతా2లో...

## మూడు రాష్ట్రాల్లో 12 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు




**న్యూఢిల్లీ,మన జనప్రగతి సెప్టెంబర్ 22:** ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 12 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. వీటిలో యూపీలో 10, ఉత్తరాఖండ్‌లో ఒక స్థానానికి ద్వైవార్షిక ఎన్నికలు, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. ఎన్నికల నోటిఫికేషన్ సెప్టెంబర్ 29న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 వరకు గడువు విధించారు. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన, 9న ఉపసంహరణకు గడువు ముగుస్తుంది. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు

మిగతా2లో...

## ఆయుర్వేద ఆసుపత్రుల అభివృద్ధికి భారీగా నిధులు: సత్యకుమార్



**అమరావతి:మన జనప్రగతి సెప్టెంబర్ 22:** ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రులు, డిస్పెన్సరీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఆయుష్ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఆరు జిల్లాల్లో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుకు రూ.27 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. విశాఖ ఆయుష్ ఆసుపత్రిలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.2.61 కోట్లు, విశాఖ, కాకినాడ ఆయుష్ ఆసుపత్రుల నిర్వహణకు రూ.1.50 కోట్ల చొప్పున నిధులు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 334 ఆయుర్వేద డిస్పెన్సరీలు, 40 కేంద్రాలకు

మిగతా2లో...

# 'స్థానికం' వందశాతం గెలిచి తీరాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)

అందిపుచ్చుకుని ఎదగాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. అదేవిధంగా పార్టీకి అవసరమైన సమయంలో పూర్తిస్థాయిలో పనిచేయాల్సిన బాధ్యత కూడా వారిపై ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతివొక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. ప్రజల్లోకి వెళ్లి, పార్టీని పటిష్ఠం చేయాలని, వారిని పార్టీపట్ల ఆకర్షితులను చేసి అభిమానాన్ని కూడగట్టి, ఓట్లుగా మార్చాలని సూచించారు. ప్రతిపక్ష నేతలు రక్తాభిషేకాలు, చంపడాలు, చావడాలు అని వారి కార్యకర్తలను రెచ్చగొడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. మీరూ ధైర్యంగా ఎన్నికలను ఎదుర్కోవాలని.. అలాగని దాడులు, దౌర్జన్యాలకు దిగొద్దని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ప్రతిపక్షం చేసే హింసాత్మక చర్యలను చట్టప్రకారం అదుపులో ఉంచడానికి తాను చర్యలు తీసుకుంటానని చంద్రబాబు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క పంచాయతీ, ఒక్క వార్డు కూడా ఓడిపోకూడదని, అలా ఎవరి ఇలాకాలో జరిగినా క్షమించే ప్రసక్తి లేదని తెగేసి చెప్పారు. అటువంటివారి రాజకీయ భవిష్యత్తు పార్టీపరంగా ఆగిపోతుందని అధినేత హెచ్చరించారు.

**తప్పుచేస్తే శిక్ష తప్పదు** 'ఇన్నేళ్లుగా రాజకీయం చేస్తున్నాను. తప్పు మాత్రం జరుగుతోంది. అనుకున్న మెజారిటీతో విజయం ఎందుకు దక్కడం లేదో తెలియదు. స్టేజీమీద ఉన్న నాయకుల్లో లోపమా, లేక మీలో లోపమా తెలుసుకోవాలి. ఇక మీదట అటువంటి లోపాలపై ప్రత్యేకంగా దృష్టి పెడతాను. ముందుగా హెచ్చరించి, వినకపోతే చర్యలకు దిగుతాను. కొంతమంది నాయకులు పదవులు వచ్చిన అహంకారంతో విర్రవీగుతున్నారు. అటువంటివారివల్ల గతంలో పార్టీపరంగా నష్టం జరిగింది. ఇకపై అలా జరగకుండా జాగ్రత్త తీసుకుంటాను. మీరైనా, నాయకులైనా, నేనైనా పార్టీ ఉంటేనే అధికారంలో ఉంటాం. అది అందరం గుర్తు పెట్టుకోవాలి. తప్పు ఎవరు చేసినా శిక్ష తప్పదు. ఈమధ్య మనలో కొంతమంది తప్పు చేస్తే ఇదే పద్ధతి అనుసరించాను. ఎన్ని చెప్పినా అంతిమంగా మీరు అర్థం చేసుకోవాల్సి వస్తోంది. పార్టీ నాయకుడైనా, కార్యకర్త అయినా వారి పనితీరుకు నిదర్శనం ఎన్నికల్లో విజయమే. అది లేనినాడు వారికి పార్టీలో కానీ, ప్రభుత్వంలో కానీ ఎటువంటి గుర్తింపు ఉండదు' అని చంద్రబాబు తెగేసి చెప్పారు.

# అంగరంగ వైభవంగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు సినిమాలు సత్తా చాటాయి. 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు లభించాయి. 'కల్కి 2898 ఏడీ' ప్రజాదరణ పొందిన ఉత్తమ చిత్రంగా నిలిచింది. అలాగే సినిమాకు అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించడంలో కీలక పాత్ర పోషించిన ప్రొడక్షన్ డిజైనర్ నితిన్ జిహానికి బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ అవార్డు లభించింది. 'కల్కి 2898 ఏడీ' చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్, నిర్మాతలు అశ్వినీదత్, స్వప్నదత్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొని అవార్డులు అందుకున్నారు.

'పుష్ప 2' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే రైటర్‌గా సుకుమార్ జాతీయ అవార్డును అందుకున్నారు.

ఇక కమిటీ కుర్రోళ్లు, 35.. చిన్న కథ కాదు, లక్కీ భాస్కర్ సహా పలు చిత్రాలు వివిధ విభాగాల్లో మొత్తం 9 అవార్డులను సొంతం చేసుకోవడం విశేషం.

'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి రెండు కేటగిరీల్లో వచ్చిన అవార్డులను మేకర్స్ అందుకున్నారు.

పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పి, శ్రీ రాధా దామోదర స్టూడియోస్ తరపున నిహారిక కొణిదెల 'ఉత్తమ తెలుగు చిత్రం' విభాగంలో 'రజత కమలం' అవార్డును స్వీకరించగా, దర్శకుడు యదు వంశీ కూడా ఈ ప్రతిష్టాత్మక అవార్డుని అందుకున్నారు.

ఈ చిత్రానికి పి. రవి కుమార్ 'ఉత్తమ మేకప్' అవార్డును అందుకున్నారు.

ఈ వేడుకకు నాగబాబు, పద్మజ కొణిదెల, ఫణి అడపాక తదితరులు హాజరయ్యారు.

# ఆయుర్వేద ఆసుపత్రుల అభివృద్ధికి భారీగా నిధులు: సత్యకుమార్

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత మందులు అందించనున్నట్లు తెలిపారు. డిస్పెన్సరీల ఆధునికీకరణకు మొత్తం రూ.46.23 కోట్లు కేటాయించామని సత్యకుమార్ చెప్పారు. 150 డిస్పెన్సరీల పనులు పూర్తి చేసేందుకు రూ.28.41 కోట్లు, 64 డిస్పెన్సరీల పునర్నిర్మాణం, డిజిటల్ నెట్‌వర్కింగ్‌కు రూ.12.80 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 55 పంచకర్మ ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలకు కూడా నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు, కీళ్ల వ్యాధుల చికిత్స కోసం 26 కేంద్రాలకు రూ.2.05 కోట్లు, వయోమిత్ర కార్యక్రమానికి రూ.62.40 లక్షలు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. 8,400 పాఠశాలల్లో ఆయుర్ విద్య కార్యక్రమానికి రూ.6.50 కోట్లు, గర్భిణులు, నవజాత శిశువుల కోసం సుప్రజ కార్యక్రమానికి రూ.8.50 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. కాకినాడ ఆయుర్వేద కళాశాల అభివృద్ధికి రూ.4.10 కోట్లు, ధర్మవరం నూతన ఆయుర్వేద కళాశాలకు రూ.3.71 కోట్లు, విజయవాడలోని ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఆధునికీకరణకు రూ.3 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

**గుంటూరు జీజీహెచ్‌లో జన్యు పరీక్షల కేంద్రం** గుంటూరు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జీజీహెచ్)లో క్యాన్సర్ రోగుల కోసం సమగ్ర జన్యు పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా ఇలాంటి అధునాతన జన్యు పరీక్షలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో తొలి దశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు జన్యు పరీక్షలు నిర్వహించనున్నారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి, రోగికి సరైన చికిత్స అందించేందుకు జన్యు పరీక్షలు ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. క్యాన్సర్ నివారణ, చికిత్సపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కర్నూలులో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.120 కోట్లతో క్యాన్సర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. **కోర్టుకు వెళ్లొచ్చు: సత్యకుమార్** డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా విషయంలో ఎలాంటి అవినీతి జరగలేదని సత్యకుమార్ యాదవ్ అన్నారు.

ఆధారాలు ఉంటే కోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో పరీక్ష లేకుండానే ఉద్యోగాలు ఇచ్చేందుకు చట్టంలో నిబంధనలు ఉన్నాయన్నారు. చట్ట ప్రకారమే డీఎస్సీ నియామకాలు జరిగాయని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి కేవలం తన అస్తిత్వాన్ని చాటుకునేందుకే డీఎస్సీ అవినీతి పేరుతో రోడ్డెక్కారని మంత్రి విమర్శించారు. లిక్కర్ స్కామ్‌పై దర్యాప్తు పూర్తయిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద దాడులకు పాల్పడిన వారినే పోలీసులు అరెస్టు చేస్తున్నారని మంత్రి వెల్లడించారు.

# మూడు రాష్ట్రాల్లో 12 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్టు ఈసీ ఒక ప్రకటనలో వెల్లడించింది. యూపీలో నవంబర్ 25తో ముగియనున్న 10 మంది రాజ్యసభ సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీరిలో బిజెపికి చెందిన అరుణ్‌సింగ్, గీతా శాక్య, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, బీఎల్ వర్మ, సీమా ద్వివేది, హర్దీప్‌సింగ్ పురి ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్‌గోపాల్ యాదవ్, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన రామ్‌జీ గౌతమ్ పదవీకాలం కూడా ముగియనుంది. మాజీ ఉపముఖ్యమంత్రి దినేశ్ శర్మ రాజీనామాతో మరో రాజ్యసభ స్థానం సెప్టెంబర్ 11 నుంచి ఖాళీగా ఉంది. అండమాన్–నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆయన రాజీనామా అమల్లోకి వచ్చింది. ప్రస్తుత అసెంబ్లీ బలాబలాల ప్రకారం యూపీలో బిజెపి నేతృత్వంలోని కూటమి 8 స్థానాలు, సమాజ్‌వాదీ పార్టీ 2 స్థానాలు గెలుచుకునే అవకాశముందని రాజకీయ లెక్కలు సూచిస్తున్నాయి. దీంతో బీఎస్పీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చు. ఇక ఉత్తరాఖండ్‌లో బిజెపి సభ్యుడు నరేశ్ బన్సాల్ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఆ ఒక్క స్థానానికి ఎన్నిక జరగనుంది. మరోవైపు పశ్చిమ బెంగాల్‌లో నటులు కోయెల్ మల్లిక్‌గా ప్రసిద్ధి చెందిన రుక్మిణి మల్లిక్ జూలై 16న రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికైన సభ్యులు 2032 ఏప్రిల్ 2 వరకు మిగిలిన పదవీకాలాన్ని కొనసాగిస్తారు.

# నంది అవార్డులకు ఏపీ సర్కార్ గ్రీన్‌సిగ్నల్

### 20122024 పెండింగ్ అవార్డులతో పాటు 2025 అవార్డులు కూడా

### డిసెంబర్‌లో ఫిల్మ్, టీవీ అవార్డుల ప్రదానోత్సవాలు

**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 22:** ఆంధ్రప్రదేశ్‌లో నంది అవార్డుల సందడి మళ్లీ ప్రారంభం కానుంది. సినీ, టెలివిజన్ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. నంది అవార్డుల నిర్వహణకు అనుమతిస్తూ ప్రభుత్వం G.O.Rt.No. 1843 ఉత్తర్వులు జారీ చేసింది. 2012 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న నంది అవార్డులతో పాటు 2025 సంవత్సరానికి సంబంధించిన అవార్డులను కూడా నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 20122016 కాలానికి సంబంధించిన నంది, జాతీయ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవాన్ని నవంబర్ 2026లో విజయవాడలో నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.



20172024, 2025 సంవత్సరాల నంది అవార్డుల కోసం జ్యూరీ కమిటీల ఏర్పాటు ప్రక్రియను సెప్టెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ అవార్డులకు సంబంధించిన విజేతల జాబితాను నవంబర్ 2026లో అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిపింది. 2017 నుంచి 2024 వరకు ప్రతి ఏడాదికి మొదటి, రెండో ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌లతో పాటు రెండు స్పెషల్ జ్యూరీ అవార్డులు మాత్రమే ప్రదానం చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. టీవీ విభాగంలోనూ ప్రతి ఏడాది మొదటి, రెండో ఉత్తమ మెగా సీరియళ్లతో పాటు రెండు స్పెషల్ జ్యూరీ అవార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొంది. **డిసెంబర్‌లో రెండు వేర్వేరు వేడుకలు** నంది ఫిల్మ్ అవార్డ్స్ (20172024 & 2025) ప్రదానోత్సవాన్ని డిసెంబర్ 2026లో అమరావతి/ విజయవాడలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

నంది టీవీ అవార్డ్స్ (20172024 & 2025) ప్రదానోత్సవాన్ని డిసెంబర్ 2026లో తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో దాదాపు దశాబ్దానికి పైగా పెండింగ్‌లో ఉన్న నంది అవార్డుల ప్రదానోత్సవాలకు మార్గం సుగమమైంది.

# వందే మాతరం పాడకుంటే జైలు శిక్ష కరెక్ట్ కాదు: సుప్రీంకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లంఘించదని తెలిపింది. వందేమాతరంలోని ఒకటి లేదా అన్ని చరణాలను పాడటానికి అభ్యంతరం తెలిపేవారిని శిక్ష?ర్హమైన పరిణామాలకు గురిచేయకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం పేర్కొంది. ఇక్కడ జాతీయ గీతం ఏమిటనేది వివాదాస్పదం కాదని, జాతీయ గీతం ఎలా ఉండాలి, అది రెండు చరణాలా లేదా నాలుగు చరణాలా అనే అంశంపై ప్రభుత్వం నిర్ణయిస్తుందని ధర్మాసనం పేర్కొంది. అయితే ఆర్టికల్ 25, 26 (మత స్వేచ్ఛ)ను ఉల్లంఘించలేరు లేదా మనస్సాక్ష?కి విరుద్ధంగా వ్యవహరించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేరని స్పష్టం చేసింది. జాతీయ గీతంలోని ఒకటి లేదా అన్ని చరణాలను ఆలపించాలా వద్దా అనేది వ్యక్తి తన మనస్సాక్షి ప్రకారం నిర్ణయించుకోవచ్చని, అందుకు నిరాకరించినందుకు అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోరాదని ధర్మాసనం తెలిపింది. మత స్వేచ్ఛ, రాజ్యాంగబద్ధమైన సహనం, మౌనంగా అభ్యంతరం తెలిపే హక్కును సమర్థిస్తూ 1986లో 'బిజోయ్ ఇమ్మాన్యుయేల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇప్పటికీ వర్తిస్తుందని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. చరిత్రను శ్రద్ధగా చదివిన ఎవరికైనా జాతీయ గీతం గురించి తెలిసి ఉంటుందని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుండే 'వందేమాతరం' జాతీయ గీతంగా ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదే నిర్ధారణకు రావడానికి ఆచార వ్యవహారాలను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని జస్టిస్ బాగ్చీ పేర్కొన్నారు. జనవరిలో హోంశాఖ జారీ చేసిన పరిపాలనా ఆదేశాలు, జూలైలో తదుపరి సర్క్యులర్‌తో కలిపి, జాతీయ గౌరవానికి అవమానాలను నివారించే (సవరణ) చట్టం, 2026ను సవాలు చేస్తూ ప్రముఖ కర్ణాటక గాయకుడు, రచయిత టి.ఎం. కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం నుండి కోర్టు స్పందన కోరింది.

# ఒప్పందాన్ని తిరస్కరిస్తే .. ఇరాన్‌ను నాశనం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ఇరాన్‌తో ఒప్పందం కుదురుతుందని అంచనా వేస్తూనే, ఒకవేళ ఒప్పందాన్ని తిరస్కరిస్తే ఇరాన్‌ను నాశనం చేస్తామని బెదిరించారు. మంగళవారం ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో ట్రంప్ ప్రసంగిస్తూ ఇరాన్‌కు రెండు ప్రత్యామ్నాయాలను సూచించారు. ఒకటి.. దేశాన్ని పునర్నిర్మించుకోవడానికి వీలు కల్పించే ఒప్పందం చేసుకోవడమా లేక అమెరికా సైనిక చర్యను కొనసాగించడమా తేల్చుకోవాలని హెచ్చరించారు. "నేను ఇస్లామిక్ రిపబ్లిక్‌ను త్వరగా నాశనం చేయాలా? లేక వారి మనుగడకు అవకాశం లేకుండా భవిష్యత్తు వైభవం లేదా తరాలపై ఆశ లేకుండా నరకానికి పంపాలా?" అని ట్రంప్ అన్నారు. అమెరికా సైనిక చర్యను ట్రంప్ సమర్థించడంతో ఇరాన్ ప్రతినిధులు వాకౌట్ చేశారు. దీంతో హాలులో కేవలం ఒక ప్రతినిధి మాత్రమే మిగిలినట్టు సమాచారం. అదే విధంగా "వారు ఒకప్పుడు మధ్యప్రాచ్యంలో పెత్తనం చెలాయించేవారు, కానీ ఇప్పుడు అలా లేరు" అని ఇరాన్‌ను ప్రపంచంలోనే ఉగ్రవాదా నికి ప్రధాన స్పాన్సర్‌గా ట్రంప్ అభివర్ణించారు. టెహ్రాన్‌తో ఒప్పందం కోసం వాషింగ్టన్ పదేపదే ప్రయత్నించిందని, కానీ ఇరాన్ ఆ ప్రయత్నాలను తిరస్కరించిందని చెప్పారు. టెహ్రాన్ తన క్షిపణి , డ్రోన్ సామర్థ్యాలను విస్తరిస్తోందని, అవి ఐరో పాకు ముప్పు కలిగించగలవని కూడా ట్రంప్ ఆరోపించారు. **ఒత్తిడిని కొనసాగించాలని ట్రంప్ పిలుపు** టెహ్రాన్‌పై ఒత్తిడిని కొనసాగించాలని ట్రంప్ ఆయా దేశాలను కోరారు . వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులను ఖండించినందుకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి ధన్యవాదాలు తెలిపారు. "ఇప్పుడు మనం ఒత్తిడిని కొనసాగించడంలో అంతే ఐక్యంగా ఉండాలి" అని ఆయన అన్నారు. హార్ముజ్ జలసంధి గుండా యూఎస్ నౌకాదళం 1 బిలియన్ బ్యారెళ్లకు పైగా చమురును రవాణా చేసిందని అన్నారు.

# గురువుల జోలికొస్తే సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనపై ఆయన స్పందిస్తూ వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "నా మీద కోపం ఉంటే నాతో తేల్చుకుందాం.. రా. కానీ టీచర్ల జోలికొస్తే సహించేది లేదు" అంటూ లోకేశ్ హెచ్చరించారు. ఉపాధ్యాయులపై దాడులను తీవ్రంగా ఖండించిన ఆయన.. ఇలాంటి ఘటనలను ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. డీఎస్సీ అంశంతోపాటు ఏపీపీఎస్సీ, కల్తీ మద్యం అంశాలపైనా బహిరంగంగా చర్చిద్దామని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. తేదీ, సమయం నిర్ణయించుకుని చర్చకు రావాలని కోరారు. తమ కుటుంబం నీతి, నిజాయితీలతో జీవించిందని లోకేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఒక్క ఆరోపణనైనా నిరూపించగలిగారా? అంటూ వైసీపీ నేతలను ప్రశ్నించారు. "మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదు.. ఇప్పుడు భయపడతామా జగన్?!" అంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి లోకేశ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు ఐక్యంగా ఉండాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని లోకేశ్ పిలుపునిచ్చారు.

# స్థానిక ఎన్నికలకు జనసేన సన్నద్ధం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక సంస్థల ఎన్నికల కోసం నియమించిన సమన్వయకర్తలు, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, సపోర్ట్ టీం సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాలపై పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నియమించిన కమిటీలు క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ, గ్రామస్థాయి నుంచి ఎన్నికల సన్నాహాలను పటిష్టం చేసుకోవాలని ఆయన సూచించారు.

# అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో ఆయనకు ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. అలాగే యాదాద్రి, నందిగామ, శామీర్‌పేట్‌లో నాలుగు ఓపెన్ ప్లాట్లతో పాటు విశాఖపట్నంలో 800 చదరపు గజాల ఓపెన్ ప్లాట్ గుర్తించామని చెప్పారు. అలాగే బ్యాంకు ఖాతాల్లో రూ.41లక్షలు, పోస్టాఫీసులో రూ.12 లక్షలు డిపాజిట్ల రూపంలో ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఇక ప్రైవేట్ ఆర్థిక సంస్థల్లో రూ.35 లక్షలు, మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.29.55 లక్షలు పెట్టుబడులు పెట్టినట్లు కనుగొన్నామని ఏసీబీ అధికారులు వివరించారు. దీంతో పాటు 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారమని ఏసీబీ అధికారులు తెలిపారు. జాగ్వార్, ఆడీ, టాటా నెక్సాన్ సహా 3 కార్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్, వెస్పా, యాక్టివా, యమహా వంటి నాలుగు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు గుర్తించారమని అన్నారు. సుమారు రూ.5 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు ఉన్నాయని కూడా చెప్పారు. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాల ప్రకారం లక్ష్మీభాస్కర్ మొత్తం ఆస్తుల విలువ రూ.6.13 కోట్లు ఉంటుందని లెక్కించామని పేర్కొన్నారు. వివాదంలో ఉన్న ఓ ఫ్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు తమ సోదాల్లో గుర్తించామని ఏసీబీ అధికారులు వెల్లడించారు. అలాగే తన సన్నిహితులకు రూ.1.33 కోట్లు అప్పుగా లక్ష్మీభాస్కర్ ఇచ్చినట్లు గుర్తించామన్నారు.

# గురుకుల కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

- పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలి
- సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర



**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 22:–**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచాలని సీఐటీయూ పత్తికొండ మండల ప్రధాన కార్యదర్శి ఎం. రవిచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ అనుబంధ గురుకుల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్దోస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.రవిచంద్ర,ఉద్యోగుల సంఘం కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులపై అదనపు పనిభారం మోపడం సమంజసం కాదన్నారు.కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా వేతనాలు చెల్లించకుండా రెండు, మూడు నెలలకు ఒకసారి జీతాలు ఇవ్వడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగుల శ్రమకు తగిన వేతనం అందించాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను సకాలంలో చెల్లించాలని, అదనపు పనిభారాన్ని తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రుతమ్మ, ఈరమ్మ, గౌరమ్మ, నాగవేణి, వహీదా, జగ్గిలి లక్ష్మి, బాట లక్ష్మి, సులోచన, అనిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల హక్కుల కోసం ఐలు నిరంతర పోరాటం

- ఆదోని నూతన కమిటీని ఏర్పాటు చేసిన రాష్ట్ర అధ్యక్షుడు కుమార్.




**ఆదోని మన జనప్రగతి సెప్టెంబర్ 22:–**న్యాయవాదుల హక్కుల కోసం ఐలు నిరంతరం పోరాటం సాగిస్తుందని ఐలు(ఏ.ఐ.ఎల్.యు) రాష్ట్ర అధ్యక్షుడు కే. కుమార్ అన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా ఆదోనిలో రెవెన్యూ భవన్ లో ఏర్పాటు చేసిన ఐలు సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కే. కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో న్యాయవాదుల సమస్యలు వారికి దక్కాల్సిన హక్కుల కోసం ఐదు నిరంతరం పోరాడుతుందని, ఈ మధ్యకాలంలో న్యాయవాదులకు జరుగుతున్న అన్యాయాలు, దాడులపై గొంతు విప్పి ప్రశ్నించి వారికి న్యాయం జరిగేలా ఐలు కృషి చేస్తుందన్నారు. భవిష్యత్ రోజుల్లో భవిష్యత్తు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల సమస్యల పరిష్కారం ఐలు ఎప్పుడూ ముందుంటుంది అన్నారు. అనంతరం ఆదోని ఐలూరు నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కే.జీ. వెంకటేష్, బషీర్ అహ్మద్, అధ్యక్షుడిగా ఖలందర్, కార్యదర్శిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా మధు, అజయ్ కుమార్, సహాయ కార్యదర్శులుగా విష్ణు, హుస్సేన్ సాని, ట్రెజరర్ గా ఆసిఫ్, స్పోర్ట్స్ సెక్రటరీగా మల్లికార్జున తో పాటు మరి కొంతమందిని ఈసీ మెంబర్లుగా ఎన్నుకున్నారు. ఈనెల 26న కర్నూల్ లో నిర్వహించే జిల్లా మహాసభకు కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులందరూ హాజరై మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.


# రూ.480 కోట్ల తాగునీటి పథకాన్ని పరిశీలించిన కలెక్టర్

- పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం





**లింగాల మన జనప్రగతి సెప్టెంబర్ 22:–**పులివెందుల ప్రాంత ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో రూ.480 కోట్ల అంచనా వ్యయంతో లింగాల మండలం పార్నపల్లి గ్రామం వద్ద చేపడుతున్న పులివెందుల తాగునీటి సరఫరా పథకం పనులను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మంగళవారం పరిశీలించారు. త్వరలో పులివెందుల తాగునీటి సరఫరా పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి, పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పథకంలో చేపడుతున్న వివిధ పనులు, వాటి ప్రస్తుత పరిస్థితి, మిగిలిన పనులు, వాటిని పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకం ద్వారా పులివెందుల ప్రాంత ప్రజలకు నిరంతరాయంగా, సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఎస్ఈ ఏడుకొండలు, డీపీఓ రామచంద్ర, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, టీడీపీ మాజీ శాసన మండలి సభ్యులు రవీంద్రనాథ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ప్రాజెక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నిఘా నీడలో కొనసాగుతున్న గణేష్ నిమజ్జన శోభాయాత్ర

## కర్నూలు కొండారెడ్డి బురుజు పై నుండి స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 22:–**కర్నూలు నగరంలో పోలీసుల నిఘా నీడలో పటిష్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య మంగళవారం అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జన శోభాయాత్రను కొనసాసింది. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ క్షేత్రస్థాయిలో స్వయంగా ఊరేగింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి పాత బస్టాండ్, గడియారం ఆసుపత్రి మీదుగా సాగే ఊరేగింపు




రూట్‌ను పరిశీలించారు. అనంతరం కొండారెడ్డి బురుజు పైకి వెళ్లి, అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా శోభాయాత్ర ను , ప్రధాన కూడళ్లలోని ట్రాఫిక్ క్రమబద్ధీకరణను మరియు భక్తుల జనసందోహాన్ని స్వయంగా వీక్షించి భద్రతా చర్యలను సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని,



ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా నిమజ్జనం సాఫీగా పూర్తయ్యేలా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. పర్యవేక్షణలో ఎస్పీ వెంట నంద్యాల ఏఎస్పీ సుస్మిత, కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, డోన్ డీఎస్పీ శ్రీనివాసులు,సీఐలు మధుసూదన్ రావు,కేశవరెడ్డి,ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా,పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 22:–**కర్నూలు నగరంలో గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం అభినందనీయమని, గణనాథుని దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమలు, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని రాంబొట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహ పూజలో రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమలు, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి. భరత్, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది నీటి కొరత వంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ, గణేష్ నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టారని తెలిపారు. కెనాల్ అప్‌స్ట్రీమ్,డౌన్‌స్ట్రీమ్ ప్రాంతాలను పరిశీలించి,నిమజ్జనానికి అనుకూలంగా నీటిని నిల్వ చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం



జరిగిందన్నారు. అలాగే కొండారెడ్డి బురుజు సమీపంలో కూడా నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రజల విశ్వాసాలు, సంప్రదాయాలు, సెంటిమెంట్లకు అనుగుణంగా గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమంలో ప్రజలు, భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు. గణనాథుని కృపతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, కాలువలు జలకళతో నిండాలని,ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆరోగ్యంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, అందరి సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి స్వార్థ భావనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సంతోషంగా,భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని సూచించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా మొదట విఘ్నేశ్వరుడిని పూజించడం మన సంప్రదాయమని పేర్కొన్నారు. గణపతి ఆరాధనతో చేపట్టే ప్రతి కార్యక్రమం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తికావాలని ప్రజలంతా ప్రార్థిస్తారని తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా,సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నామని,ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్,నగర పాలక కమిషనర్ చల్లా ఓబులేసు,సంబంధిత అధికారులు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయ గణపతి లడ్డూను దక్కించుకున్న డాక్టర్ కె. హరినాథ్ రెడ్డి

**కర్నూలు, మన జనప్రగతి సెప్టెంబర్ 22 : –** కర్నూలు కలెక్టరేట్‌లోని సమాచార శాఖ ఆవరణలో పాత్రికేయ గణపతి మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన పాత్రికేయ గణపతికి తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని పాత్రికేయ గణపతి లడ్డూ వేలంపాటను నిర్వహించారు. ఈ వేలంపాటలో శ్రీచక్ర మీడియా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. హరినాథ్ రెడ్డి రూ.10 వేలతో పాత్రికేయ గణపతి లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూను దక్కించుకున్న డాక్టర్ కె. హరినాథ్ రెడ్డికి పాత్రికేయ గణపతి మహోత్సవ సమితి సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం సమితి సభ్యులు డాక్టర్ కె. హరినాథ్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం డీజే వాహనంతో ఉత్సవ వాతావరణంలో డాక్టర్ కె. హరినాథ్ రెడ్డిని ఆయన నివాసం




వరకు సాగనంపారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించిన పాత్రికేయ గణపతి మహోత్సవంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాత్రికేయులు, సమాచార శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ వర్గాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు. పాత్రికేయుల ఐక్యతకు ప్రతీకగా నిర్వహించిన పాత్రికేయ గణపతి మహోత్సవం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. నిమజ్జనోత్సవంలో భాగంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల సందడి మధ్య నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి..!



- వేల్పులలో ఎంపీడీఓ ఎం.శారదమ్మ అవగాహన
- బిన్ బ్యాగ్,స్వచ్ఛ రథం వినియోగంపై ప్రజలకు అవగాహన

**వేముల మన జనప్రగతిసెప్టెంబర్ 22:–**గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై బాధ్యత వహించాలని ఎంపీడీఓ ఎం.శారదమ్మ సూచించారు. వేముల మండల పరిధిలోని వేల్పుల గ్రామంలో మంగళవారం ఉదయం ఆమె పర్యటించి పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా "వేల్పుల గ్రామ




సచివాలయాన్ని ఎంపీడీఓ ఎం.శారదమ్మ ఆకస్మికంగా తనిఖీ" చేశారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు,ఇంటింటి నుంచి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం గ్రామ ప్రజలకు బిన్ బ్యాగ్ వినియోగం, చెత్తను సక్రమంగా అందించే విధానంపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి స్వచ్ఛ రథం సిబ్బందికి అందించాలని సూచించారు. చెత్తను రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందించాలని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు స్వచ్ఛ రథం సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాన్ని స్వచ్ఛంగా,పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎంపీడీఓ ఎం.శారదమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి




**కడప,టౌన్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:-** జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యాచరణ బృందం సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నారు. అక్టోబర్ 1న 2 ఏళ్ల పిల్లలకు 200 మి.గ్రా., 3 నుంచి 19 ఏళ్ల వారికి 400 మి.గ్రా. మాత్రలను మధ్యాహ్న భోజనం అనంతరం ఇవ్వాలని సూచించారు. సెప్టెంబర్ 25న ప్రధాన కార్యక్రమం, మాత్రలు తీసుకోలేని పిల్లలకు అక్టోబర్ 5న మళ్లీ మాత్రలు అందించనున్నారు. పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించాలని, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.

## కడప జెడ్పి కార్యాలయంలో జడ్పీటీసీలకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు

**- హాజరైన పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి**



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 22:-** కడప జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీటీసీల పదవీకాలం ముగిసిన సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి పాల్గొన్నారు.జిల్లాలోని వివిధ మండలాల జడ్పీటీసీలతో కలిసి పాల్గొన్న మారెడ్డి లతా రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు.ఉప ఎన్నికలో గెలిచి ఏడాది కాలమే పదవిలో ఉన్నప్పటికీ, లభించిన ఈ స్వల్ప వ్యవధిలోనే ప్రజల సమస్యల పరిష్కారానికి పులివెందుల మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానని తెలిపారు.ప్రజల ఆదరాభిమానాలు, ప్రజాప్రతినిధులు,అధికారుల సహకారం ఎప్పటికీ మరువలేనిదని ఆమె పేర్కొన్నారు.అనంతరం అధికారులు ,ప్రజాప్రతినిధులు జడ్పీటీసీల సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. తోటి సభ్యులు జ్ఞాపకాలను పంచుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడంతో సమావేశం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభ




**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 22:-**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలో భాగంగా పత్తికొండ మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన వివిధ పనులు, వాటి అమలు తీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు.గ్రామ సభలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల వివరాలు, వాటి అమలు, కూలీలకు అందుతున్న ఉపాధి తదితర అంశాలపై సామాజిక తనిఖీ నిర్వహించారు. పనులపై గ్రామస్తులు, రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పథకం అమలులో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యంతో సామాజిక తనిఖీలు నిర్వహించడం వల్ల పనుల నాణ్యత, అమలు తీరును తెలుసుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిని రాజశేఖర్, రాజారెడ్డి, ఏపీవో వెంకటేశ్వర్లు, ఇంజనీర్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, సామాజిక తనిఖీ అధికారులు, సచివాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శి దివ్య, ఉపాధి హామీ మేటీలు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై సామాజిక తనిఖీ గ్రామ సభలో తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేలా అన్నీ చర్యలు తీసుకుంటున్నాం

- వెలిదండ్ల గ్రామంలో అవకాడో పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి



**కడప,మన జనప్రగతి సెప్టెంబర్ 22:-** పులివెందుల నియోజక వర్గం, లింగాల మండలం, వెలిదండ్ల గ్రామంలో రైతు కర్నా వరదారెడ్డి సాగు చేస్తున్న అవకాడో పంటను మంగళవారం జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా అవకాడో తోటను సందర్శించిన కలెక్టర్, పంట సాగు విధానం, పెట్టుబడి వ్యయం, దిగుబడి, మార్కెట్ ధరలు, రైతుకు లభిస్తున్న ఆదాయం తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు.అవకాడో వంటి అధిక పోషక విలువ కలిగిన ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను సూచించారు. పంట ఎంపిక నుంచి సాగు, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ, కోత అనంతర నిర్వహణ, మార్కెటింగ్ వరకు రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలను ఉద్యానశాఖ అధికారులు అందించాలని ఆదేశించారు.అలాగే అవకాడో సాగుకు అనుకూలమైన భూములు, నీటి వనరులు ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆసక్తి ఉన్న రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేసే విధానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో అవకాడో సాగును విస్తరించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన పంటల ప్రోత్సాహకాలు, రాయితీలు మరియు ఇతర పథకాలపై రైతులకు పూర్తి సమాచారం అందించి, అర్హులైన రైతులు వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వెలిదండ్ల గ్రామంలో అవకాడో సాగు చేస్తున్న రైతు అనుభవాలను ఇతర రైతులకు కూడా తెలియజేసి, జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపరిచే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పంటకు మార్కెటింగ్ సదుపాయాలు, గిట్టుబాటు ధరలు లభించేలా రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని, పంట ఉత్పత్తిని నాణ్యతా ప్రమాణాలతో మార్కెట్‌కు తీసుకెళ్లే విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీ సుబ్రమన్యేశ్వర రావు, ఉద్యాన శాఖాధికారి హరి ప్రసాద్, డ్వామా పిడి ఆదిశేషారెడ్డి, ఎపిఎంఐపి పిడి శ్రీ రమణ, మాజీ శాసన మండలి సభ్యులు శ్రీ రవీంద్ర నాద్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో రూ.51 కోట్ల పనులకు శంకుస్థాపన



**మచిలీపట్నం,మన జనప్రగతి సెప్టెంబర్ 22:-** మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.51 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ఈ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో రోడ్లు, పార్కులు, శ్మశాన వాటికలు, తాగునీరు, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మచిలీపట్నంలో సుమారు రూ.27 కోట్లతో సీసీ రోడ్లు, రూ.7.50 కోట్లతో మున్సిపల్ కార్యాలయం, పాలక మండలి సమావేశ మందిరం, రూ.15 కోట్లతో పార్కులు, శ్మశాన వాటికల్లో మౌలిక వసతుల పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.అమృత్ పథకం కింద రూ.75 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.13 కోట్ల నిధులు సమకూరినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో మచిలీపట్నంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు.కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## గుంతలమయంగా రామస్వామిపల్లె రహదారి

- చినుకు పడితే చెరువులను తలపిస్తున్న రహదారి
- రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబర్ 22:-**మండలంలోని పెద్దపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రామస్వామిపల్లెకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. వర్షం కురిస్తే గుంతల్లో నీరు చేరి రహదారి చెరువులను తలపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రావెల్, మట్టి తరలించే భారీ వాహనాలు నిరంతరం రాకపోకలు సాగించడం వల్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని రైతులు తెలిపారు. ఈ మార్గం ద్వారా వేల ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులు తమ పొలాలకు వెళ్లడంతో పాటు, పండించిన ధాన్యాన్ని తరలించేందుకు కూడా ఇదే రహదారిని వినియోగిస్తున్నారు. రహదారి అధ్వానంగా మారడంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ విషయమై ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును వివరణ కోరగా,మందపల్లి,రామస్వామిపల్లెకు వెళ్లే రహదారి భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్నట్లు రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. భారీ వాహనాలు రాకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు.



## గౌతమ్ రెడ్డిపై పోలీసుల లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం

- వైయస్సార్ టి.యు.సి నాయకులు




**కడప మన జన ప్రగతి సెప్టెంబర్ 22:-**డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలను నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వైఎస్ఆర్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు డా.పూనూరు గౌతమ్ రెడ్డిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని వైయస్సార్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ టి.యు.సి నాయకులు ఖండించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలను నిరసిస్తూ విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్) కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్ఆర్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు డా. పూనూరు గౌతమ్ రెడ్డిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని వైఎస్ఆర్ టీయూసీ నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ ఘటనపై కడప ఉమ్మడి జిల్లా వైఎస్ఆర్ టీయూసీ అధ్యక్షులు ఎం. జాషువా, కడప నగర అధ్యక్షులు ఎన్. నాగరాజు, వైఎస్ఆర్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. శ్రీధర్, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి, కడప నగర ప్రధాన కార్యదర్శి ఫయాజ్ ఖాన్, కమలాపురం మండల అధ్యక్షులు లింగారెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో టీచర్ ఉద్యోగాల నియామకాల్లో డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ, ప్రభుత్వం వాటిపై సమాధానం చెప్పకుండా ఉద్యమకారులపై దాడులకు పాల్పడటం సరికాదని వారు అన్నారు.అక్రమాలపై చర్చకు రావాలని కోరుతున్నప్పటికీ, సమస్యపై చర్చించకుండా ఆందోళన చేస్తున్న నాయకులు,కార్యకర్తలపై పోలీసులు చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు.ప్రభుత్వం ఇదే విధంగా ఉద్యమకారులపై దాడులకు పాల్పడితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలని వారు డిమాండ్ చేశారు.

## పూర్వీకుల ఆస్తిని తమకు ఇప్పించాలని బాధితుడి విజ్ఞప్తి: బాధితుడు సుదర్శన్ రెడ్డి



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 22:-**తమ పూర్వీకులకు చెందిన వ్యవసాయ భూమిని తమకు ఇప్పించి న్యాయం చేయాలని చాపాడు మండలం తిప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుదర్శన్ రెడ్డి అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కడపలోని వైఎస్ఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.చెన్నూరు మండలం చిన్న మాసుపల్లె గ్రామంలో తమ పూర్వీకులు నివసించేవారని, అక్కడ సర్వే నంబర్ 437లో 2 ఎకరాల 9 సెంట్లు, సర్వే నంబర్ 434లో 72 సెంట్ల వ్యవసాయ భూమి తమ పూర్వీకులకు ఉందని సుదర్శన్ రెడ్డి తెలిపారు.ఈ భూమి కడప నగరంలోని గ్లోబల్ కాలేజీ సమీపంలో ఉందని పేర్కొన్నారు.కొన్ని సంవత్సరాల క్రితం తమ తండ్రి రామకృష్ణారెడ్డి నుంచి సొసైటీ పేరుతో చెప్పి కొమ్మ ప్రవీణ, భార్య కొమ్మ సోమశేఖర్ రెడ్డి పేరుతో భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై తండ్రిని ప్రశ్నించగా, తనకు తెలియదని, మైకంలో తనతో సంతకం చేయించుకున్నారని చెప్పినట్లు తెలిపారు.భూమి విషయంలో ప్రశ్నించినప్పుడు తనను బెదిరించినట్లు కూడా సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఈ స్థలానికి సంబంధించిన వివాదం గత 14 సంవత్సరాలుగా కోర్టులో కొనసాగుతోందని తెలిపారు. కోర్టు వివాదంలో ఉన్నందున ప్రజలు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం,కొనుగోలు చేయడం వంటివి చేయవద్దని సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## పాలకొండ్రాయునిపల్లెలో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

- తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు..
- స్వామి వారిని దర్శించుకున్న పలువురు టిడిపి నాయకులు



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబర్ 22:-**మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ పరిధి పాలకొండ్రాయునిపల్లెలో గణనాథుడి 17వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.తొమ్మిది రోజుల పాటు వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు అందుకున్న గణనాథుడికి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బాలిశెట్టి హరిప్రసాద్, మండల అధ్యక్షుడు రాజశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి రాజానాయుడు, నియోజకవర్గ రైతు విభాగం కన్వీనర్ మల్లు వెంకటసుబ్బారెడ్డి, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి తదితరులు హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య అతిథులను శాలువాతో సత్కరించి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పాలకొండ్రాయునిపల్లెలో గణేష్ ఉత్సవాల్లో పాల్గొంటున్నానని, గ్రామ ప్రజలు ఐకమత్యంతో వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోలీస్ శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేయడంతో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. అన్నప్రసాద వితరణలో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. కుప్పాల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో మండల, గ్రామ ప్రజలకు సుఖసంతోషాలు, భోగభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాప్ కార్యాలయంపై దాడి ఘటనపై మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరిక



**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 22:–** విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు, వైసీపీ శ్రేణుల మధ్య జరిగిన ఉద్రిక్తతపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర స్పందించారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్లపై ఆరోపణలు చేస్తున్న వారు ఆధారాలు చూపాలని, ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలు పారదర్శకంగా జరిగాయని, ఇచ్చిన హామీ మేరకు 16 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు తమ సర్టిఫికెట్లపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు శాప్ కార్యాలయానికి వచ్చిన సమయంలో ఉద్రిక్తత చోటుచేసుకుందని తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద జరిగిన ఘటనలో దాడులకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఉపాధ్యాయులపై అసత్య ఆరోపణలు చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం సరికాదని అన్నారు.

# వినాయకుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 22:–** రాయచోటి పట్టణంలోని కొత్తపేట రోడ్డు రామాలయం సమీపంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వినాయకుని విగ్రహం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాటుకూరి మధు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులు అన్నమయ్య జిల్లా ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆరోగ్యం, సౌభాగ్యం వెల్లివిరియాలని కోరుకున్నారు. ప్రజలు చేపట్టే ప్రతి మంచి కార్యక్రమం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యేలా శ్రీ గణనాథుని కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. వినాయకుని ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, సుఖశాంతులు నెలకొనాలని కోరుతూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటాం

- పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి
- మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి పిలుపు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:** ప్రజల సమస్యల పరిష్కారానికి టీడీపీ శ్రేణులు ఎల్లప్పుడూ ముందుంటాయని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి స్పష్టం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన పాల్గొని, ప్రజల నుంచి నేరుగా అర్జీలు, వినతులు స్వీకరించారు. సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా దర్బార్ అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వార్డు స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలతో నిరంతరం మమేకం కావాలని కేడర్‌కు సూచించారు. ఈ సమావేశంలో కూటమికి చెందిన స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులు వెళ్లే దారి ఆక్రమించి కంచె ఏర్పాటు



**చిట్వేలి మనజనప్రగతి సెప్టెంబర్ 22:–** ఎన్నో సంవత్సరాలుగా రైతులు, గ్రామస్తులు వినియోగిస్తున్న పొలాల లోనికి వెళ్లడానికి ఉన్న రహదారికి అడ్డంగా కంచె వెలిసింది. దారి ఆక్రమణకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని ఆరోపిస్తూ మైలపల్లి పంచాయతీ గొల్లపల్లి గ్రామస్తులు చిట్వేలి మండలం రెవెన్యూ అధికారి నరసింహారావు కు సమర్పించారు. గ్రామకంఠం నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిని కొందరు ఆక్రమించి కంచె నిర్మించారని, దీంతో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. గ్రామకంఠం నుంచి పొలాల్లోకి వెళ్లే ఈ దారిని స్థానికులు ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు వినియోగిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్‌లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో పొలాలకు వెళ్లాల్సి ఉండగా, ప్రస్తుతం కంచె ఏర్పాటు చేయడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారిందన్నారు. దారి మూసివేయడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించి దారికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, హద్దులు, గ్రామ మ్యాప్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరారు. దారి ఆక్రమణకు గురైనట్లు రికార్డుల ద్వారా నిర్ధారణ అయితే ఆక్రమణను వెంటనే తొలగించి, గ్రామస్తుల రాకపోకలకు మార్గాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చిట్వేలి ఎంఆర్‌ఓ నరసింహారావును కలిసి తమ సమస్యను వివరించారు. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, దారి విషయంలో స్పష్టత తీసుకురావడంతో పాటు ఆక్రమణలు ఉంటే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల రాకపోకలకు ఆటంకం కలగకుండా అధికారులు తక్షణమే స్పందించాలని గొల్లపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# బాలల హక్కులపై అవగాహన అవసరం



**కె.వి.పల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 22:–** బాలల హక్కులు, వారి రక్షణకు అందుబాటులో ఉన్న చట్టాలు, సహాయ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్లు రోహిత, షక్రియ తెలిపారు. మిషన్ వాత్సల్య, జిల్లా శిశు సంక్షేమ మరియు సాధికారత, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మహిళా సమాఖ్య సభ్యులకు బాలల హక్కులు, చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రతి బాలుడికి విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధి, గౌరవంగా జీవించే హక్కులు ఉన్నాయని తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై హింస, వేధింపులు, అక్రమ రవాణా వంటి సమస్యలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాలలకు ఎలాంటి ఆపద ఎదురైనా, రక్షణ అవసరమైనా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర సేవల కోసం 112కు సమాచారం అందించి సహాయం పొందవచ్చని వివరించారు. బాలల సమస్యలను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ వారికి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు,పెన్షనర్లకు ఊరట

- సమ్మెలు లేకుండానే సమస్యల పరిష్కారం: ఏపీ ఎన్జీవోస్ నేతల వెల్లడి





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:–** సమ్మెలు,ఆందోళనల బాట పట్టకుండా ప్రభుత్వంతో జరిపిన సామరస్యపూర్వక చర్చలతోనే ఉద్యోగులు,పెన్షనర్ల సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఏపీ ఎన్జీవోస్ పులివెందుల తాలూకా సహ అధ్యక్షుడు పి.సుకుమార్,ఉద్యోగ ప్రతినిధి జి.నరేష్ స్పష్టం చేశారు. స్థానికంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 9న ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్,ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ కడప పర్యటన సందర్భంగా పులివెందుల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు,మహిళా ఉద్యోగులు తరలివెళ్లారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉద్యోగులందరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. జేఏసీ నేతలు ముఖ్యమంత్రితో జరిపిన చర్చలు ఫలించాయని,ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన రెండు డీఏలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులకుగ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల చిరకాల ఆకాంక్ష అయిన 'ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్' (ఏ ఏ ఎస్) అమల్లోకి రావడం హర్షణీయమన్నారు. 6 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు స్పెషల్ గ్రేడ్ స్కేల్ అమలు చేసేలా ప్రభుత్వం జీవో నెం.7 విడుదల చేసిందని వివరించారు. పెన్షనర్లకు అదనపు పెన్షన్ పెంపు (జీవో 126) ప్రకారం వృద్ధ పెన్షనర్లకు అందించే అదనపు పెన్షన్ శాతాన్ని ప్రభుత్వం పెంచిందని తెలిపారు. 70 ఏళ్లు దాటిన వారికి 7 శాతం నుంచి 10 శాతం కి పెంపు,75 ఏళ్లు దాటిన వారికి 12 శాతం నుంచి 15 శాతం కి పెంపు,(80 ఏళ్లు పైబడిన వారికి పాత శాతమే కొనసాగుతుంది)ఈ పెంపు డిసెంబర్ 2026 పెన్షన్ నుంచి అమలవుతుందని,పెరిగిన మొత్తం జనవరి 1,2027 నాటికి వారి ఖాతాల్లో జమ అవుతుందని స్పష్టం చేశారు.

# ఆర్టీసీ బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం



**పీలేరు మన జనప్రగతి సెప్టెంబర్ 22:–** వాయల్పాడు సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన బాధితులను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి వాయల్పాడు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న క్షతగాత్రులను స్వయంగా కలుసుకుని వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో ఎంతమంది గాయపడ్డారు, వారికి అందుతున్న వైద్య సేవలు, చికిత్స వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆసుపత్రిలోని వైద్య సదుపాయాలు, అత్యవసర చికిత్స అందించే విధానం తదితర అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, అందువల్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, ఆసుపత్రి కమిటీ చైర్మన్ పి.వి. నారాయణ, వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మహిధర్ రెడ్డి, టీడీపీ నాయకులు లంకిపల్లి మధు, రాజేంద్రచారి, బాకా రాజగోపాల్, చాను, డిష్ బ్రదర్స్, బొక్కసం బ్రదర్స్, బీజేపీ నాయకులు విష్ణు, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ ఇందిరా దేవి



**చిట్వేలి మనజనప్రగతి సెప్టెంబర్ 22:–** పుల్లంపేట మండలంలోని ఎస్‌బివిడి సభ ఉన్నత పాఠశాలను మంగళవారం తిరుపతి డివిజనల్ విద్యాశాఖ అధికారిణి ఇందిరా దేవి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎస్ఎస్‌సి 2025 – 2026 ఫలితాల గురించి సమీక్షించి ప్రస్తుతం అమలు చేస్తున్న మిషన్ మార్చ్ 2027 గురించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. మార్చి –2027 లో విద్యార్థులు 100% ఉత్తీర్ణత శాతం సాధించాలని సూచించారు. అలాగే మండలాన్ని జిల్లాలో ముందంజలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డివిజన్ విద్యాశాఖ అధికారి తో పాటు మండల విద్యాశాఖ అధికారి –1 జి. చక్రధర్ రాజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందము పాల్గొన్నారు.

# హొన్నల్లిలో సేవా సంకల్ప్ అభియాన్ వైద్య శిబిరం




**బొమ్మనహల్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:–** మండల పరిధిలో దర్గా హొన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హొన్నల్లి గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ రఫియా సుల్తానా ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు,ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు హెచ్‌బీ,బీపీ, షుగర్,రక్త పరీక్షలతో పాటు టీబీ, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు,అనంతరం ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ రఫియా సుల్తానా ప్రజలకు అవగాహన కల్పించారు వచ్చే నెల 17వ తేదీ వరకు హొన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు, ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు,ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయభారతి, ఆరోగ్య కార్యకర్త షబానా,ఆశా కార్యకర్తలు,అంగన్వాడీ కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

- వైద్యాధికారి డాక్టర్ కుమార్ రాజా



**బొమ్మనహల్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:–** బొమ్మనహల్ మండలం శ్రీధరగట్ట గ్రామంలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ కుమార్ రాజా తెలిపారు,అర్హత కలిగిన అభ్యర్థులు పీహెచ్‌సీలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు,ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు, నిర్ణీత గడువు అనంతరం వచ్చిన దరఖాస్తులను స్వీకరించబోమని వైద్యాధికారి డాక్టర్ కుమార్ రాజా తెలిపారు.

# పుట్టపర్తి విమానాశ్రయంలో నారా లోకేష్‌కు ఘన స్వాగతం



**పుట్టపర్తి మన జనప్రగతి సెప్టెంబర్ 22:–** రాప్తాడు నియోజకవర్గ పర్యటన నిమిత్తం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌కు టీడీపీ జోనల్ కో–ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, హిందూపురం ఎంపీ బి.కె. పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, దగ్గుపాటి వెంకట ప్రసాద్, ఎం.ఎస్. రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆలం నరసానాయుడు, ఏడీసీ చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో కారణంగా రైతు కుటుంబాలకు నెలకు పదివేలు ఇవ్వాలి

**● రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్**



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 22:**-ఎల్‌నినో ప్రభావంతో నైరుతి ఋతుపవనాల సమయంలో లోటు వర్షపాతం నమోదైనది అని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్ అన్నారు. చిట్వేలి మండలం వెంకటరాజు పల్లిలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా రైతులు పంట వేయలేక, వేసిన పంటలను నీటి కొరతతో కాపాడుకోలేక నష్టపోతున్నారని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి అవగాహన ఉందని. వారు వీలైన పరిధిలో ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే అన్నారు. కానీ ఈ ఎల్‌నినో ప్రభావం ఈశాన్య రుతుపవనాల పైన ఉంటుంది కావున 2027లో నైరుతి రుతుపవనాలు వరకు ప్రతి రైతు కుటుంబానికి నెలకు పదివేల రూపాయలు ఇచ్చి రైతులను కరువు నుండి కాపాడాలని కోరారు. వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఏ విధంగా ఆర్థిక సహాయం అందిస్తున్నారో అదేవిధంగా ఈ కరువును ప్రకృతి విపత్తుగా తీసుకొని 2027 వరకు ప్రతి నెలకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం, ప్రతి రైతు కుటుంబానికి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గాలేరు – నగిరిని త్వరితగతిన పూర్తి చేసి కడప, రాజంపేట, కోడూరు, తిరుపతి ప్రాంతాల చెరువులకు నీటిని నింపడం ద్వారా ఇటువంటి కరువు సమయాలకు భూమిలో నీటిమట్టం పూర్తిగా తగ్గకుండా నీటి లభ్యత ఉంటుంది కావున గాలేరు– నగరి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర, నారాయణ, శివయ్య, చంగయ్య, నాగేశ్వర, బాబు పాల్గొన్నారు.

# ఈనెల 27న ఆప్కాస్ ఉద్యోగుల రాయలసీమ రణభేరిని జయప్రదం చేయండి

**- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 22:**-సెప్టెంబర్ 27న తిరుపతిలో జరగనున్న రాయలసీమ రణభేరిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశం లో వారు మాట్లాడుతూ,రాష్ట్రంలో 91 డిపార్ట్ మెంట్లలో ఆప్కాస్,ఔట్ సోర్సింగ్ పేరుతో లక్షలాది మంది ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని, అయినా వారికి రెగ్యులరైజేషన్ లేదు, సమాన పనికి సమాన వేతనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 30 సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారే తప్ప వేతనాలు పెంచడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు.జీతాలు పెంచాలని జిల్లా అధికారులకు,మంత్రులకు,ముఖ్యమంత్రికి వినతిపత్రాలు ఇస్తే "ఇది మా చేతిలో లేదు" అని తప్పించుకుంటున్నారని, నిత్యావసర ధరలు, పిల్లల స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం ఛార్జీలు ఆకాశాన్ని తాకుతుంటే, కార్మికుల వేతనాలు మాత్రం భూమికి అంటుకుని ఉన్నాయని విమర్శించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వృద్ధాప్య, వితంతు పెన్షన్లు కూడా వీరి కుటుంబాలకు అందడం లేదని, చనిపోయిన కార్మికుని స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వడం లేదని, దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు వయోపరిమితి 62 ఏళ్లు పెంచి, ఔట్ సోర్సింగ్ కార్మికులకు మాత్రం 60 ఏళ్లకే ముగించడం దారుణమన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాయకుండా, ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి సెప్టెంబర్ 13న "రణభేరి ఇక సమరమే" అనే నినాదంతో ప్రచారం ప్రారంభించి, సెప్టెంబర్ 27న తిరుపతిలో రాయలసీమ రణభేరిని ముగిస్తున్నామని తెలిపారు.విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి భాగ్యలక్ష్మి, నాయకులు మాధవ్, మస్తాన్, రైతు సంఘం నాయకులు రామచంద్ర లు పాల్గొన్నారు

# వీఆర్ఏల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా....

**- వీఆర్ఏల సమస్యలపై ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి హామీ**

**పీలేరు మన జనప్రగతి సెప్టెంబర్ 22:**-వీఆర్ఏల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వీఆర్ఏలు మంగళవారం కలికిరి మండలం నగిరిపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 16వ తేదీ నుంచి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద వీఆర్ఏలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పే స్కేల్ అమలు, ఉద్యోగ భద్రత కల్పించడం, మృతి చెందిన వీఆర్ఏల నామినీలను వీఆర్ఏలుగా నియమించడం, అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించడం తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు.వీఆర్ఏల సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, వారి సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తుందని, వీఆర్ఏలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



# ఏఐటీయూసీ రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాల ఆవిష్కరణ



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబరు 22:**-రైల్వేకోడూరు బత్యాల భవన్‌లో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న తిరుపతి జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం రైల్వే కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్షుడు మాదరాజు గంగాధర్, ప్రధాన కార్యదర్శి దాసరి జయచంద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1920లో ఏర్పడిన ఏఐటీయూసీ 106 ఏళ్లుగా కార్మికుల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. కార్మిక చట్టాలను పరిరక్షించడంతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ, పారిశుధ్య కార్మికులు తెల్లవారు జామునే విధులకు హాజరై ప్రజలకు పారిశుధ్య సేవలు అందిస్తున్నప్పటికీ వారికి రక్షణ పరికరాలు, బీమా, కనీస వేతనం, ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందడం లేదని వారు అన్నారు. కార్మికులకు రక్షణ పరికరాలు, హెల్త్‌కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, కనీస వేతనం రూ. 26 వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా కార్మికులు హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు సుధాకర్, రాజేష్, పెంచలయ్య, గజ, కిషోర్, పెంచలమ్మ, పార్వతి, లక్ష్మీదేవి, మహేష్ పాల్గొన్నారు.

# ఆవకాడో తోటను పరిశీలించిన కలెక్టర్ చెరుకూరి శ్రీదర్





**లింగాల మన జనప్రగతి సెప్టెంబర్ 22:**-మండల పరిధిలోని వెలిదండ్ల గ్రామపోలంలో సాగు చేస్తున్న అవకాడో పంటను మంగళవారం జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తోటలో ఆవకాడో మొక్కల ఎదుగుదల,సాగు విధానం,అంశాలను పరిశీలించారు. రైతు వరధారెడ్డిని అభినందిస్తూ,ఆవకాడో సాగులో ఆయన అనుసరిస్తున్న పద్ధతులు, అందుబాటులో ఉన్న రకాలు, మొక్కల వివరాలు, సాగులో ఎదురవుతున్న సవాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు.ఆవకాడో సాగులో రైతు అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులను పరిశీలించిన కలెక్టర్ ఈ తరహా ప్రత్యామ్నాయ ఉద్యానవన పంటలను జిల్లాలో మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు.ముఖ్యంగా వరదారెడ్డి తోటలోని నాణ్యమైన (మదర్ ప్లాంట్స్)నుంచి మంచి రకాలను ఎంపిక చేసి నర్సరీని అభివృద్ధి చేయాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.తద్వారా నాణ్యమైన ఆవకాడో మొక్కలను జిల్లాలోని ఇతర రైతులకు కూడా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు,జిల్లాలో ఆవకాడో సాగు విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.విదేశీ పంటగా పేరున్న ఆవకాడోను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజయవంతంగా సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న రైతు వరధారెడ్డిని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.ఇలాంటి ప్రగతిశీల రైతుల అనుభవాలను ఇతర రైతులకు చేరువ చేయడం ద్వారా ప్రత్యామ్నాయ ఉద్యానవన పంటల సాగుపై అవగాహన పెంచవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి శ్రీ హరి ప్రసాద్ ,జిల్లా వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరావు,సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి,ఉద్యాన అధికారి దీప, మండల వ్యవసాయ అధికారి రమేష్,సచివాలయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# హెచ్.ఐ.వి/ఎయిడ్స్ నివారణలో యువతకు అవగాహనే కీలకం




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 22:**-అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం నందు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపిశాక్స్) ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సూచనలతో పి.సి.ఎస్.ఎస్.టి.ఐ. ఎన్‌జీవో ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ ఐ వి/ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించాము.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.వెంకటేశ్వర్లు గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ ఐ వి/ ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించాము. పి.సి.ఎస్.ఎస్ ప్రాజెక్ట్ ఓ.ఆర్.డబ్ల్యూ.ఈ అలేఖ్య మాట్లాడుతూ హెచ్ ఐ వి/ఎయిడ్స్ తో పాటు లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు (ఎస్ టి ఐ), వాటి నివారణ, కండోమ్ ఉపయోగం, హెచ్ ఐ వి (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్) యాక్ట్, 2017, ఏఆర్ టి మందులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సేవలు మరియు టోల్‌ఫ్రీ నంబర్ 1097 తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాము. హెచ్ ఐ వి పై సరైన అవగాహన కలిగి, అపోహలు మరియు వివక్షను దూరం చేయడంలో యువత ముందుండాలని అన్నారు. అలాగే హెచ్ ఐ వి నివారణ కార్యక్రమాల్లో 95-95-95 లక్ష్యాల ప్రాధాన్యతను వివరించారు. హెచ్ ఐ వి తో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి తమ హెచ్ ఐ వి స్థితి గురించి అవగాహన కల్పించడం, హెచ్ ఐ వి పాజిటివ్‌గా గుర్తించబడిన వారిలో 95 శాతం మందికి చికిత్స అందించడం, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందిలో వైరల్ లోడ్ నియంత్రణ సాధించే దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు పేర్కొన్నారు. పి సి ఎస్ ఎస్ ప్రాజెక్ట్ ఓఆర్డబ్ల్యూ ఈ.అలేఖ్య పిఈ వి.వరలక్ష్మి పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న కూచిపూడి నృత్య విభావరి



**కూకట్పల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 22:**- వివేకానంద నగర్ కాలనీ అపార్ట్మెంట్స్ ప్రాంగణంలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీహాల్ లో నెలకొల్పిన వినాయక మండపంలో మయూరి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య విభావరి కార్యక్రమం నిర్వహించారు. అకాడమీ నిర్వాహకులు శ్రీదేవి, నందిత పర్యవేక్షణ లో జరిగిన ఈ కార్యక్రమం లో భాగంగా విద్యార్థినిలు, చిన్నారులు ప్రత్యేక వేశాధారణలతో ఆధ్యాత్మిక పాటలు, రామదాసు, అన్నమాచార్య కీర్తనలు, గణపతి పాటలకు నృత్యాలు చేసి ఆకట్టుకున్నాయి. విష్ణువు, శివుడు, జగన్మాత వేశాధారణలతో చిన్నారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం అసోసియేషన్ సభ్యులు చేతుల మీదుగా నృత్యకారులకు బహుమతులు ప్రధానం చేశారు.

# వైభవంగా శ్రీవారి రథోత్సవం

**- గోవిందనామస్మరణతో మారుమోగిన తిరుమాడ వీధులు**



**తిరుమల మన జనప్రగతి సెప్టెంబరు 22:**-తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని రథాన్ని లాగి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయ ప్పస్వామివారిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. స్వామివారు రథంపై విహరిస్తుండగా భక్తులు అడుగడుగునా హారతులు సమర్పిస్తూ, "గోవిందా.. గోవిందా" అంటూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు

# అర్హులందరికీ నులిపురుగు నివారణ మాత్రలు అందించండి

**- వేంపల్లె ఎంపీడీవో కులాయమ్మ**



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 22:**- మండలం లోని ఆయా గ్రామాల్లో అర్హులైన వారందరికీ నులి పురుగు నివారణ మాత్రలను అందించాలని ఎంపీడీవో కులాయమ్మ వైద్యాధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఈ నెల 25న నిర్వహించ తలపెట్టిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన అంశాలపై టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేతృత్వంలో ఈ నెల 25న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, జూనియర్ కళాశాలల్లో ఉన్న 1 నుంచి 19 ఏళ్ల బాలురు, బాలికలకు మధ్యాహ్న భోజనం తర్వాత ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఆమె సూచించారు . తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో ఈ మాత్రలు ఇచ్చి మింగించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. పిల్లలు ఈ మాత్రలు మింగడం వల్ల కడుపులో నులిపురుగులు లేకుండా ఉండడమే కాకుండా రక్తహీనత కూడా ఉండదన్నారు. ఈ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది,తల్లిదండ్రులు విజయవంతం చేయాలని ఆమె కోరారు. సమావేశంలో తహసిల్దార్ జల్లా శివశంకర్ రెడ్డి,తాళ్లపల్లె వైద్యాధికారి పూర్వజ,ఎంఈఓ లు వెంకట్రాంరెడ్డి,స్టాలిన్ ఐజాక్,సిహెచ్ఓ వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఫక్రుద్దీన్, అంకయ్య, అరుణా దేవి, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగ యువతకు భారీ ఉద్యోగమేళా

**ఓబులవారిపల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 22:**–రైల్వేకోడూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భారీ ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు మొక్క వరలక్ష్మి తెలిపారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ మొక్క రూపానందరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఓబులవారిపల్లి మండలం మొక్కవారిపల్లి గ్రామంలో మంగళవారం ఉద్యోగమేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సీడాగ్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ సాయి డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ భారీ ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని మొక్క వరలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సిగమాల మల్లికార్జునరెడ్డి, బత్తిని వేణుగోపాల్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, కళాశాల సిబ్బంది, అధికారులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

# మినిమం టైమ్ స్కేల్ అందరికి వర్తింపజేయాలి

### - ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌కు సిఐటియు వినతి




**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 22:**–ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్న ఉద్యోగులు అందరికి మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని సిఐటియు జిల్లా జనరల్ సెక్రటరీ బి. మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ విజయ్ ప్రకాష్ ను సిఐటియు జిల్లా జనరల్ సెక్రటరీ బి. మనోహర్ కలిసి పిఆర్ సి, మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని వినతి పత్రం అందజేశారు. అలాగే ఉద్యోగులకు ఉన్న సమస్యలపై డైరెక్టర్ తో చర్చించారు. పెండింగ్ లో ఉన్న పిఆర్ సి హరియర్స్ ను కూడ వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఏజెన్సీ ద్వారా పని చేస్తున్న ఆఫీసు బాయ్స్, సెక్యూరిటీ, శానిటేషన్, హౌస్ కీపింగ్, ల్యాబ్ అటెండర్, ప్లంబర్, గార్డియన్, ల్యాబ్ అసిస్టెంట్లు, అటెండర్స్ లతో పాటు ఆయా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు అందరికి మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేసేందుకు కృషి చేయాలని కోరారు. 2022-23 కు సంబంధించి పిఆర్ సి, అరియర్స్ పెండింగ్ లో ఉన్నాయాని వాటిపై కూడ దృష్టి పెట్టాలని కోరారు. సిఐటియు జిల్లా జనరల్ సెక్రటరీ బి మనోహర్ ఇచ్చిన వినతిని స్పదించిన డైరెక్టర్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

# రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుపై మొగ్గు చూపాలి

### - వేంపల్లె ఏవో బాలగంగాధర్ రెడ్డి




**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 22:**–మండలం లోని ఆయా గ్రామాల రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుపై ఎక్కువ మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి అన్నారు. వేంపల్లి లోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ బి.ఆర్ సి పాయింట్ పర్సన్ లకు రెండు రోజుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాల పరిస్థితులు కనుగుణంగా రైతులు మార్పులకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ప్రతాప్, శ్రీకాంత్ , లోకేష్, ఈశ్వరమ్మ, శ్రీవాణి, గంగిరెడ్డి శిక్షణ ఇస్తూ ప్రతి ఒక్కరు సొంతంగా ప్రకృతి వ్యవసాయం లో పి యం డి ఎస్ విత్తన గుళికల తో వేసి ఏ గ్రేడ్, ఏ టీ యం మోడల్ వేసుకొని అనుభవాలు గ్రామంలో రైతులకు చెప్పి చేయించాలని సూచించారు. ప్రతి వి ఓ లో బి ఆర్ సి సెంటర్ పెట్టీ కిట్స్, ద్రావణాలు, కషాయలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ట్రైనర్స్, పాయింట్ పర్సన్ లు పాల్గొన్నారు.

# డీఎస్సీ ఉపాధ్యాయులను కించపరచడం సరికాదు

**• టిడిపి తెలుగు యువత జిల్లా అధ్యక్షులు పుత్త ఎల్లారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్**




**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 22:**–2025 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను కష్టపడి సాధించుకున్న అభ్యర్థులపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ వారిని కించపరచడం సరికాదని తెలుగుదేశం పార్టీ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పుత్త ఎల్లారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్ లు అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..విజయవాడలో వైసీపీ నేతలు చేస్తున్న ఆందోళనలు, విమర్శలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. డీఎస్సీ నియామకాలకు సంబంధించి ఎవరి వద్దైనా ఆధారాలు ఉంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి పరిష్కరించుకోవచ్చని సూచించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎల్లారెడ్డి తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాదనే భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. విజయవాడలో జరిగిన ధర్నాలో పాల్గొన్న వారిలో డీఎస్సీ బాధితులు ఎవరూ లేరని ఆయన పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్న వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం, వంశీధర్, సాయి, జియావుద్దీన్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.


# ఆదర్శ పాఠశాల విద్యార్థినులకు ఇండస్ట్రియల్ విజిట్




**రామాపురం మన జనప్రగతి సెప్టెంబర్ 21:**–స్థానిక పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్‌క్యూఎఫ్ లో భాగంగా బ్యూటీ అండ్ వెల్‌నెస్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థినులకు సోమవారం ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు వొకేషనల్ ట్రైనర్ ఎస్. శకుంతల ఆధ్వర్యంలో 9, 10, 11, 12 తరగతులకు చెందిన 205 మంది విద్యార్థినులు లక్కిరెడ్డిపల్లెలోని 'వసూస్ బ్యూటీ పార్లర్'ను సందర్శించారు. ఈ సందర్భంగా బ్యూటీ పార్లర్‌లోని పరిశుభ్రత, ప్రొఫెషనల్ స్కిన్‌కేర్, హెయిర్‌కేర్ పరికరాల పనితీరు, కస్టమర్ల నిర్వహణ తదితర అంశాలను విద్యార్థినులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థినులకు వృత్తిపరమైన అవగాహన, ప్రాక్టికల్ అనుభవం పెరుగుతుందని వొకేషనల్ ట్రైనర్ శకుంతల తెలిపారు. భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇలాంటి ఇండస్ట్రియల్ విజిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# అభివృద్ధి,ప్రజాసేవలో చెరగని ముద్ర వేసుకున్న మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి

**• జడ్పీటిసిగా రెండు పర్యాయాలు, మండల అధ్యక్షుడిగా, సర్పంచ్‌గా తనదైన శైలిలో చెరగని ముద్ర • జడ్పీటిసి పదవి కాలం విజయవంతంగా ముగుస్తున్న సందర్భంగా అభినందనలు**



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 22:**–వేంపల్లె మండల అభివృద్ధి, ప్రజా సేవలో చెరగని ముద్ర వేసుకుని తన నాయకత్వంలో విశిష్ట ప్రస్థానం సంపాదించి.. వేంపల్లె మండల అభివృద్ధి ప్రధాతగా పేరు పొందిన నేత వేంపల్లి జెడ్పిటిసి సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి అని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సంయుక్త కార్యదర్శి బక్కన్న గారి పల్లె బుక్కే రమేష్ నాయక్ అన్నారు. జడ్పిటిసి గా పదవీకాలం ఈనెల24 న ముగియనున్న తరుణంలో రమేష్ నాయక్ జడ్పిటిసిని కలిసి ఆయన సేవలను గుర్తుకు తెచ్చుకొని కొనియాడారు. పులివెందుల నియోజకవర్గం వేంపల్లె మండల పరిధిలోని గిడ్డంగివారిపల్లి గ్రామానికి చెందిన మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి, ప్రజాసేవను తన జీవిత ధ్యేయంగా భావించి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజా నాయకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారన్నారు . ఆయన రాజకీయ ప్రస్థానంలో రెండు పర్యాయాలుగా జడ్పీటిసి సభ్యునిగా, మండల అధ్యక్షునిగా, గిడ్డంగివారిపల్లి గ్రామ సర్పంచ్ గా, పార్టీ మండల ఇంచార్జీగా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారన్నారు. వైఎస్ఆర్ కుటుంబం పట్ల విధేయత, మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ల నాయకత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం తనవంతు కృషి చేశారన్నారు. వేంపల్లె మండల అభివృద్ధిలో భాగంగా ఆధునాతనమైన జిల్లా పరిషత్ బాలుర, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇండోర్ స్టేడియం, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల, వైఎస్ఆర్ మెమోరియల్ పార్కు, ఆర్టీసీ బస్టాండ్, అగ్నిమాపక కేంద్రం, రోడ్డు విస్తరణ పనులు, రోడ్డు భవనాల అతిథి గృహం, రైతు బజార్, బీసి హాస్టల్, ఎంపిడిఓ, తహసీల్దార్ కార్యాలయాలకు ఆధునీకరణ తదితర విశేష అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అంతే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు అనుగుణంగా డిప్లమా, ట్రిపుల్ ఐటీకి సంబంధించిన ఉన్నత విద్యా కార్యక్రమాలకు తనదైన శైలిలో అభివృద్ధికి కృషి చేశారన్నారు . పదవులు తాత్కాలికమైన. ప్రజల కోసం చేసిన సేవలు మాత్రం చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అలాంటి ప్రజా సేవ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ మాచిరెడ్డి భవిష్యత్ లో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి వేంపల్లె మండలానికి, జిల్లాకు, రాష్ట్రానికి మరింత సేవ చేసే అవకాశం కలగాలని మనస్ఫూర్తిగా కొరుకుంటున్నారు.

# అధిక లోడుతో రవాణా.. ప్రమాదాలకు నిలయాలు

**• అధిక బరువుతో వెళ్తున్న లారీలు, ట్రిప్పర్లు.. • ప్రయాణికులకు ఇబ్బందులు • నిబంధనలు పట్టించుకోని వాహనదారులు.. • తనిఖీలు మరిచిన అధికారులు**



**ఓబులవారిపల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 22:**–అధిక లోడుతో రాకపోకలు సాగిస్తున్న లారీలు, ట్రిప్పర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జనసంచారం అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక బరువుతో వాహనాలను నడపడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో మంగళవారం ముగ్గురాయి పౌడర్ బ్యాగులతో అధిక లోడుతో వెళ్తున్న ఓ ట్రిప్పర్ పంచర్ కావడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధిక బరువుతో వాహనాలు నడపడం వల్ల టైర్లు పంచర్ కావడం, వాహనాల అదుపు తప్పడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలు ప్రమాదవశాత్తు ఇతర వాహనాలను ఢీకొంటే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనావాస ప్రాంతాల్లో ఇలాంటి వాహనాల రాకపోకలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వివిధ సామగ్రిని రవాణా చేస్తున్న లారీలు, ట్రిప్పర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి అధిక లోడ్ రవాణాను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఆపస్ ముందంజ

### - ఆపస్ అన్నమయ్య జిల్లా సహాధ్యక్షులు పచ్చార్ల సుధాకర్



**పీలేరు మన జనప్రగతి సెప్టెంబర్ 22:**–ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ముందంజలో ఉందని ఆ సంఘం అన్నమయ్య జిల్లా సహాధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో పీలేరు మండలంలోని వివిధ పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎదురవుతున్న సాంకేతిక, ఆర్థిక సమస్యలను రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి ఆపస్ కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని కోరారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి, కమిటీ నివేదిక అందించేలోపు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు ఆపస్ సంఘంలో సభ్యత్వం తీసుకుని సంఘ బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీలేరు మండల అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, కేవీ పల్లి మండల ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా ఆర్థిక కార్యదర్శి శివశంకర్, గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర్లు, తలపుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డప్ప, అమరనాథ్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై వైకాపా నేతల దాడి అన్యాయం


**• మాజీ ఎంపీ డాక్టర్ ఎన్.తులసి రెడ్డి**



**వేంపల్లె మన జన ప్రగతి సెప్టెంబర్ 22:**–స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై వైకాపా నేతలు దాడులు చేయడం దారుణమని, వైకాపా ఒక అరాచక పార్టీ, రౌడీల పార్టీ అని, కూటమి ప్రభుత్వం ఒక అసమర్థ, దద్దమ్మ, చేతగాని ప్రభుత్వమని మాజీ ఎంపీ రాష్ట్ర కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆరోపించారు. వేంపల్లి లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2026 సెప్టెంబర్ 21న సోమవారం నాడు విజయవాడలో శాప్ కార్యాలయం వద్ద రెండున్నర గంటల పాటు స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు, వైకాపా శ్రేణుల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకోవడం దురదృష్టకరం ,సిగ్గుచేటని అన్నారు. స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు గేటు లోపల, వైకాపా నాయకులు గేటు బయట మోహరించడం దురదృష్టకరమన్నారు. వైకాపా నాయకులు కర్రలు, రాడ్లు , కోడిగుడ్లతో దాడి చేయడం దుర్మార్గమన్నారు . కూటమి ప్రభుత్వ అసమర్థత, చేతగానితనం స్పష్టంగా స్పష్టంగా తెలుస్తోందన్నారు . వైకాపా ఒక అరాచక పార్టీగా, రౌడీలపాటుగా తయారు కావడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా ప్రజాస్వామ్య పద్ధతిలో, అహింసా మార్గంలో నిరసన కార్యక్రమాలు చేపట్టవచ్చు, లేదా కోర్టులను ఆశ్రయించవచ్చని, అలా కాకుండా అత్త చచ్చిన ఆరు నెలలకు కోడలు వలవలా ఏడ్చినట్లు, దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు డీఎస్సీ 2025 ఉపాధ్యాయుల నియామకం జరిగిపోయి సంవత్సరం తర్వాత వైకాపా నాయకులు హింసాత్మక పద్ధతులలో కార్యక్రమాలు చేపట్టడం అత్యంత గర్హనీయమని తులసి రెడ్డి అన్నారు. శాంతి భద్రతలను కాపాడడంలో వైకాపా ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు . డి ఎ స్సీ 2025 అవకతవకల ఆరోపణల మీద ప్రభుత్వం ఒక న్యాయ విచారణ కమిటీ ఏర్పాటు చేయడం సమంజసమన్నారు .రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో కరువు విలయతాండవం చేస్తోందని, ప్రజలు త్రాగునీరు, సాగునీరు అందక సతమతమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. పశువులకు పశుగ్రాసం లభించక కబేలాలకు తరలించే పరిస్థితి దాపురించిందని, బియ్యము, పప్పులు, వంటనూనెలు, మిర్చి, ఉల్లి తదితర నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోలు, డీజలు, ఎరువుల ధరలు ఆకాశం అంటు తున్నాయన్నారు . ఈ పరిస్థితుల్లో ప్రజా సమస్యలను గాలి కొదిలి అటు అధికార కూటమి, ఇటు ప్రతిపక్ష పార్టీ అయిన వైకాపా ఆరోపణలు, ప్రతి ఆరోపణతో సవతుల పోరు గుర్తు చేస్తూ కార్యక్రమాలు నిర్వహించడం శోచనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు .రెండు పార్టీలు రాష్ట్రానికి రాహుకేతువులుగా దాపురించాయి అన్న విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఈ రెండు పార్టీలను ఓడించి బుద్ధి చెప్పాలన్నారు.

# ప్రొద్దుటూరు పురపాలక చరిత్రలో నూతన అధ్యాయం..!

● రూ.40 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:-రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి కేటాయించిన నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధికి కేటాయించిన రూ.40 కోట్ల పనులను ముఖ్యమంత్రి వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పురపాలక కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రూ.40 కోట్లతో రోడ్లు, పార్కుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో రూ.252 కోట్లతో డ్రైనేజీ, నీటి పైప్‌లైన్లు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ తదితర పనులను యు.ఎఫ్.ఐ.డి.సి ద్వారా చేపట్టనున్నట్లు వెల్లడించారు.కూటమి ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరులో జగనన్న కాలనీ భూసేకరణలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందని ఎమ్మెల్యే ఆరోపించారు. గత పాలనలో జరిగిన అవినీతిని ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ప్రజలు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, పురపాలక కమిషనర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కొండవీటి భావన, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు, మాజీ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పులివెందులను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

**పులివెందుల నియోజకవర్గశీ టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి**

**వైఎస్సార్,జగన్‌లు సొంత నియోజకవర్గానికే తాగునీరు ఇవ్వలేకపోయారు**

**ఆరు నెలల్లో అభివృద్ధి పనుల పూర్తి,అర్హులకు ఇంటి పట్టాలు,యాజమాన్య హక్కులు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:**వైఎస్సార్,జగన్ ఇద్దరినీ ముఖ్యమంత్రులుగా గెలిపించిన పులివెందుల నియోజకవర్గానికి కనీసం తాగునీరు కూడా అందించలేకపోయారని,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఆ సమస్యను పరిష్కరించి చూపించామని టీడీపీ నేత బీటెక్ రవి స్పష్టం చేశారు.పులివెందుల మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా హైబ్రిడ్ యూటీ మోడల్ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో మున్సిపాలిటీ నిధులను ప్రజా అవసరాలకు కాకుండా ఇతర ప్రయోజనాలకు మళ్లించారని బీటెక్ రవి తీవ్రంగా విమర్శించారు.విగ్రహాలు,నిర్మాణాలను పదేపదే తొలగించి తిరిగి నిర్మించడం, మున్సిపల్ బస్టాండ్‌ను కూల్చివేయడం వంటి అనవసర పనులతో ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు.ఎర్రబల్లె చెరువుకు నీరివ్వలేని వారు బోటింగ్ పేరిట భారీగా ఖర్చులు చూపించారని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో రోడ్లు తవ్వి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మండిపడ్డారు.అమృత్ పథకం ద్వారా పులివెందుల మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత తాగునీటి సరఫరా కోసం పనులు వేగవంతం చేశామని వెల్లడించారు.కలెక్టర్,సంబంధిత అధికారులు, మెగా సంస్థ ప్రతినిధులతో ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తూ ప్రాజెక్టును తుది దశకు చేర్చినట్లు వివరించారు.రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పులివెందుల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారని,రాణితోట,శ్రీనాథ్ ప్రాంతాల్లోని రోడ్డు సమస్యలతో పాటు మిగిలిపోయిన పనులను రాబోయే ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పులివెందులలో పదేళ్లకు పైగా నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాలకు త్వరలోనే పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పిస్తామని ప్రకటించారు.నగరిగుట్టలోని సుమారు3,000 ఇళ్లతో పాటు రెండు జయమ్మ కాలనీలు,రాజారెడ్డి నగర్ కాలనీల సమస్యలను పరిశీలిస్తున్నాం అని హౌస్ నంబర్,కరెంట్ బిల్లులు ఉన్నప్పటికీ రికార్డుల్లో పేర్లు లేని సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తాం అన్నారు.ఎంఆర్‌వో, మున్సిపల్ కమిషనర్,సబ్ రిజిస్ట్రార్‌లతో సమన్వయం చేసుకుని అర్హులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా ప్రజలు బ్యాంకు రుణాలు పొందేందుకు,అవసరమైతే ఆస్తులను విక్రయించుకునేందుకు పూర్తి వెసులుబాటు కలుగుతుందని బీటెక్ రవి పేర్కొన్నారు.పులివెందులలో ప్రజాధనం వృథా కాకుండా ప్రతి పైసాను అభివృద్ధి కోసమే వెచ్చిస్తామని స్పష్టం చేశారు.

# ఉప ముఖ్యమంత్రి కృషితో మోడల్ నియోజకవర్గంగా పిఠాపురం

**- రూ.323 కోట్లతో తీర రక్షణ పనులు..53 వేల ఎకరాలకు సాగునీరు**






**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 22:-**పిఠాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెండు రోజుల పిఠాపురం పర్యటనలో భాగంగా రెండో రోజు పిఠాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. పవన్ కళ్యాణ్ కృషితో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 53 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టారని, పిఠాపురంలో రూ.230 కోట్ల అంచనా వ్యయంతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఉన్న డంపింగ్ యార్డు స్థలాన్ని 5.60 ఎకరాల్లో ఆహ్లాదకరమైన ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఉప్పాడలో 1,258 మత్స్యకార బోట్లకు భద్రతా పరికరాలు అందించడంతో పాటు తీర రక్షణకు రూ.323 కోట్లు కేటాయించినట్లు ఎంపీ తెలిపారు. జలజీవన్ మిషన్ కొనసాగింపునకు ప్రత్యేక చొరవ చూపడంతో పాటు రాష్ట్రంలో అమలవుతున్న మ్యాజిక్ డ్రైనేజీ విధానానికి దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.పిఠాపురం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# డ్రైన్ల ఆక్రమణలపై కమిషనర్ కొరడా..

**అక్రమ కట్టడాలు,బంకుల తొలగింపునకు రంగం సిద్ధం**

**దశలవారీ కార్యాచరణ ప్రణాళికకు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 22:-**పట్టణంలో వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్న డ్రైన్ల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సీరియస్‌గా స్పందించారు. డ్రైన్లను ఆక్రమించి నిర్మించిన కట్టడాలు,ఏర్పాటు చేసిన బంకులను గుర్తించి దశలవారీగా తొలగించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.పట్టణంలో వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో నీరు నిలిచిన నేపథ్యంలో కమిషనర్ మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే మున్సిపల్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో డ్రైన్లలో నీటి ప్రవాహాన్ని పరిశీలించి, నీరు నిలిచిపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పలు ప్రాంతాల్లో డ్రైన్లు ఆక్రమణలకు గురికావడంతో పాటు ప్లాస్టిక్, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల వర్షపు నీరు సక్రమంగా ప్రవహించడం లేదని గుర్తించారు. దీంతో డ్రైన్లలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించే పనులను పారిశుధ్య సిబ్బంది వెంటనే చేపట్టారు.ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి.డ్రైన్లను ఆక్రమించి వాటిపై కట్టడాలు నిర్మించడం, బంకులు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని కమిషనర్ పేర్కొన్నారు. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు కలిగించే ఆక్రమణలను సహించేది లేదని స్పష్టం చేశారు. సంబంధిత యజమానులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దశలవారీగా ఆక్రమణల తొలగింపు.పట్టణంలోని ప్రధాన డ్రైన్లు,వర్షపు నీటి ప్రవాహ మార్గాలపై ఉన్న అక్రమ కట్టడాలు, బంకులను గుర్తించి పూర్తి వివరాలను సేకరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆక్రమణల తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా తొలగించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్పించాలని సూచించారు.అలాగే డ్రైన్లలో ప్లాస్టిక్,చెత్తాచెదారం వేయకుండా ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా అవసరమైన ప్రాంతాల్లో సిల్ట్ తొలగింపు, పారిశుధ్య పనులను నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ ఆక్రమణలపై ఇకపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని,నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ స్పష్టం చేశారు.

# ఖాళీ కనిపిస్తే కన్నేస్తారు..ఆపై కాజేస్తారు

**- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేస్తున్న రియల్ ఎస్టేట్ బడాబాబులు**



**ఓబులవారిపల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 22:-**నేటి కలియుగ సమాజంలో ఎటు చూసినా అన్యాయం రాజ్యమేలుతుంది.ప్రభుత్వ భూములు అటు వాగులు వంకలు. బంజరు భూములు సైతం. ఖాళీ కనిపిస్తే కన్నేస్తారు ఆపైన కాజేస్తారు. అనే పదాలకు నిలువెత్తు నిదర్శనంగా కొంతమంది రియల్ ఎస్టేట్ బడా బాబులు దందా నడుపుతున్నారని విమర్శలు లేకపోలేదు. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మరియు రైల్వే కోడూరు మధ్యలో. అనంతరాజుపేట రెవెన్యూ పరిధిలోని కట్టా పుట్టాలమ్మ గుడి ఎదురుగా ఉన్న కడప చెన్నై ప్రధాన రహదారి పక్కన దాదాపు రెండు ఎకరాలు.భూమి ప్రభుత్వ బంజారా భూమి ఉండేది. అందులో కొన్ని గ్రామాలకు వెళ్లే రహదారులు పంట పొలాలకు వెళ్లి. మెటల్ రోడ్లు ఉండేవి ఆ కాలువలు వంకలు. రియల్ ఎస్టేట్ బడాబాబులకు భోజింగా మారాయని విమర్శలు లేకపోలేదు ఆ కాలవలు పూడ్చి దారి వేసుకొని ఎంచక్కా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అడ్డుగా లేకుండా. కాలువలను పూడ్చి సిసి రోడ్లు ఏర్పాటు చేసి ఎంత చెక్క రోడ్డు మార్గాలనుంచుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి. అత్యంత సుందరంగా రోడ్లు తయారు చేయించి వెంచర్లు వేసి ప్రైవేటు వ్యక్తులకు రియల్ ఎస్టేట్ దందాను సాగిస్తూ. వారి వ్యాపారాలు మూడు పూలు ఆరు కాయలుగా వీరాజులేటట్లు వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింపు చేస్తున్నా రానడంలో ఎటువంటి అభ్యంతరాలు లేవని తెలుస్తోంది. కొంతమంది రాజకీయ బడాబాబులు అండతో అన్ని విధాల అనుమతులు పొందుతూ వారు ఆడింది ఆటపాడింది పాటగా.వ్యాపారాలు సాగిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. అటు రెవెన్యూ అధికారులు ఇటు రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు ప్రేక్షక పాత్ర వ్యవహరిస్తూ వారి నుంచి లోపాయికాల ఒప్పందాలు కుదుర్చుకొని ముడుపులు. పుచ్చుకున్నట్లు తెలుస్తోంది ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు ప్రభుత్వం. పంట కాలువలు తదితర ప్రభుత్వానికి గండి కొట్టే విధంగా ప్రవర్తించే రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పలువురు జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులను కోరుతున్నారు

# చంద్రబాబు నాయకత్వంలో పట్టణాభివృద్ధికి మహర్దశ

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 22:-**రాయచోటి పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి వివిధ పథకాల కింద రూ.244.32 కోట్ల మేర నిధులు కేటాయించడంపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా రాష్ట్రంలోని పట్టణాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు.పట్టణ స్థానిక సంస్థల్లో ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ చర్యలు చేపడుతోందన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా, సమర్థవంతమైన మురుగునీటి పారుదల వ్యవస్థ, సుస్థిరమైన ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, నాణ్యమైన సీసీ, తారు రహదారులు, డివైడర్లు, విద్యుత్ ఆదా చేసే వీధి దీపాలు, పార్కులు, ఆటస్థలాలు వంటి మౌలిక వసతులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు.అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులను అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ), అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, హడ్కో ఇతర ప్రభుత్వ బ్యాంకుల రుణాలు, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానాలు, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) తదితర మార్గాల ద్వారా సమీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**రాయచోటికి రూ.244.32 కోట్ల నిధులు**

రాయచోటి మున్సిపాలిటీలో కీలకమైన పట్టణ మౌలిక వసతుల కల్పనకు మొత్తం రూ.244.32 కోట్ల మేర నిధులు కేటాయించినట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ నిధులతో పట్టణ ప్రజలకు అవసరమైన వివిధ మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదలకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

**అమృత్ 2.0 కింద రూ.3.68 కోట్లు**

అమృత్ 2.0 పథకం కింద రాయచోటి పట్టణంలో తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుదల, నీటి వనరుల పునరుద్ధరణ పనుల కోసం రూ.3.68 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు నీటి వనరుల సంరక్షణకు ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు.పట్టణాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి రాయచోటిని మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174